

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి శుక్రవారం 10-04-2026 సంపుటి: 01 సంచిక : 294 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Friday, 10-04-2026 Volume :01 Issue: 294 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను




జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777


# పోలింగ్ ప్రశాంతం

## వేరువేరు చోట్ల ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

- పుదుచ్చేరిలో 86శాతం..
- అసోంలో 84.42శాతం..
- కేరళలో 77.45శాతం
- అసోంలో ఘర్షణలు : 30మందికి గాయాలు, ఏడుగురు అరెస్టు
- అసోంలో పోలింగ్ బూత్‌లో వీడియో : ఎఫ్ఐఆర్ నమోదు

**న్యూఢిల్లీ ఏప్రిల్09 (నేటి దర్శిని):**
కేరళం, అసోం రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో చెదురుమదురు ఘటనలు మినహా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడు చోట్లా భారీ సంఖ్యలోనే పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో 86శాతం, అసోంలో 84.42శాతం, కేరళలో 77.45శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అస్సాంలో సాయంత్రం ఐదు గంటలకే పోలింగ్ ముగిసినా, కేరళ, పుదుచ్చేరిల్లో మాత్రం

-మిగతా 2 లో








### తుది ఒప్పందం వరకు

## ఇరాన్‌లోనే బలగాలు

- ఉల్లంఘనలు జరిగితే భారీ దాడులు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

**న్యూఢిల్లీ,**
కాల్పుల విరమణపై తుది ఒప్పందం కుదిరి అది పూర్తిగా అమలు జరిగే వరకు ఇరాన్ లోపల, చుట్టూ అమెరికా సైనిక బలగాల మోహరింపు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. పశ్చిమాసియాలో కాల్పుల విరమణ పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్న నేపథ్యంలో ఇరాన్‌పై ఒత్తిడిని కొనసాగించాలని ట్రంప్ భావిస్తున్నట్లు ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఇప్పటికే గణనీయంగా బలహీనపడిన శత్రువును ఎదుర్కొనడానికి, నాశనం చేయడానికి అవసరమైన అదనపు మందుగుండు సామగ్రి, ఆయుధాలు, అన్ని అమెరికా నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది ఒప్పందం కుదిరి, పూర్తిగా అమలయ్యే వరకు ఇరాన్‌లోపల, దాని పరిసర ప్రాంతాలలోనే ఉంటాయి అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ తెలిపారు.అవగాహన ఉల్లంఘన తీవ్ర సైనిక ప్రతిస్పందనకు దారితీయగలదని ఆయన హెచ్చరించారు. ఏ కారణం చేతనైనా దీన్ని పాటించకపోతే అప్పుడు కాల్పులు మొదలవుతాయని, మునుపెన్నడూ ఎవరూ చూడనంత శక్తివంతమైనవిగా ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా కీలక లక్ష్యాలను పునరుద్ఘాటిస్తూ ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదని, హెర్ముజ్ జలసంధి తెరిచి, సురక్షితంగా ఉండాలని ఆయన తెలిపారు.

## బెంగాల్ మార్పు కోరుకుంటోంది..



- రాష్ట్రం అంతటా నందిగ్రామ్ ఫలితాలే
- భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోంది
- బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం
- తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం

2



## దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

- చిర,చరాస్తులు కూడా లేవు
- సొంత ఇల్లు అంతకన్నా లేదు
- బ్యాంకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ

2



### ఈడెన్‌లో ముకుల్


## చౌదరి సునామీ..!

- ఐపీఎల్‌లో కొత్త హీరో ఆవిర్భావం
- లక్నోను గెలిపించిన ముకుల్ చౌదరి
- కేకేఆర్‌పై బ్యాటింగ్‌లో విధ్వంసం

**న్యూఢిల్లీ, ఏప్రిల్09 (నేటి దర్శిని):**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సంచలన విజయం సాధించింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచులో చివరి బంతికి విజయం సాధించింది. ఓ దశలో 182 పరుగుల లక్ష్య ఛేదనలో ఓటమి అంచున నిలిచిన ఆ జట్టు.. 21 ఏళ్ల ముకుల్ చౌదరి అసాధారణ బ్యాటింగ్‌తో గెలుపుగీతను దాటింది. దీంతో ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు కేకేఆర్ నాలుగు మ్యాచులు ఆడినా.. ఒక్క విజయం కూడా సాధించలేకపోయింది. 182 పరుగుల ఛేజింగ్‌తో బరిలోకి

-మిగతా 2 లో

## రాఘవ్ చద్దా కొత్త పార్టీ?!



**న్యూఢిల్లీ :**
ఆమ్ ఆద్మీ పార్టీ పక్కకు పెట్టిన ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా కొత్త రాజకీయ పార్టీని స్థాపించే సూచనలు కనిపిస్తున్నాయి! 'ఆసక్తికర ఆలోచన' పేరిట సామాజిక మాధ్యమాల్లో ఆయన షేర్ చేసిన వీడియో ప్రకారం వేరే పార్టీలో చేరే దాని కన్నా కొత్త పార్టీని స్థాపించడమే మేలన్న అభిప్రాయాన్ని ఆయన పంచుకున్నారు.సొంత పార్టీతో విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన ఈ విషయాన్ని పంచుకోవడం గమనార్హం. చద్దా తనకున్న ప్రజా మద్దతును నిలబెట్టుకోవాలంటే కొత్త పార్టీని పెట్టడమే మేలన్న ఓ కంటెంట్ క్రియేటర్ వీడియోను ఆయన తన ఖాతాలో పంచుకున్నారు.

## రేవంత్ కన్నా... కేసీఆర్ పాలనే

# బెటర్



### తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది

- నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్
- జాయతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్
- కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

**జగిత్యాల ఏప్రిల్09 (నేటి దర్శిని):**
రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు

-మిగతా 2 లో



## కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

- మూడు బ్యారేజీలను వినియోగంలోకి తేవాలి
- పనుల పర్యవేక్షణకు మేడిగడ్డ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు :
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ ఏప్రిల్09 (నేటి దర్శిని):**
కాళేశ్వరంలోని మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించారు.

-మిగతా 2 లో




## రిలయన్స్ రిటైల్ వాల్యుయేషన్ భళా

- జనవరి నాటికి రూ.9.26 లక్షల కోట్లు
- హెక్టాకార్న్ జాబితాలో ఏడో స్థానం
- స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేషన్ స్కూల్ ఆఫ్ బిజినెస్

**న్యూఢిల్లీ**
ముకేశ్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ నాయకత్వంలోని 'రిలయన్స్ రిటైల్' మరో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది జనవరి నాటికి అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం కంపెనీ విలువ (వాల్యుయేషన్) 10,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.9.26 లక్షల కోట్లు) దాటింది. దీంతో స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఈ కంపెనీని విలువపరంగా ప్రపంచంలోని ఏడో అతి పెద్ద ప్రైవేటు స్టార్టప్ కంపెనీగా ప్రకటించింది. ఏదైనా ప్రైవేటు స్టార్టప్ కంపెనీ మార్కెట్ విలువ 10,000 కోట్ల డాలర్లు దాటితే దాన్ని హెక్టాకార్న్ లేదా సూపర్ స్టార్టప్ అంటారు. మన దేశం నుంచి రిలయన్స్ రిటైల్ ఒక్కటే ఈ జాబితాలో చోటు సంపాదించింది. ప్రపంచంలో మరే ప్రైవేటు రిటైల్ స్టార్టప్ కూడా ఈ స్థాయిలో లేదని ఎస్‌జీసీబీ తెలిపింది. అగ్రస్థానంలో 'ఓపెన్ ఏఐ': ఈ తాజా జాబితాలో ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్, ఇలాన్ మస్క్ నిర్వహణలోని స్పేస్ ఎక్స్ కంపెనీలు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 100 ప్రైవేట్ స్టార్టప్ కంపెనీలతో

-మిగతా 2 లో

## భారత జీడీపీ 6.6 శాతానికి తగ్గొచ్చు

- ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్




2

## పొంగులేటి కాదు..పొంగులూటీ

- బాంబులు పేలుతాయన్న బాంబులేటి
- అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు
- క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు
- నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే ..హైడ్రా ఎందుకు వెళ్లలేదు
- గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం



**వనపర్తి, ఏప్రిల్09 (నేటి దర్శిని):**
పొంగులేటి కాదు ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్దాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్థమవుతోందని అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇదివరకు బాంబులు

-మిగతా 2 లో

### జూన్ 2నుంచి స్కూల్

## విద్యార్థులకు అల్పాహారం

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం
- డిప్యూటి సిఎం భట్టి విక్రామార్క వెల్లడి



**ఖమ్మం ఏప్రిల్09 (నేటి దర్శిని):**
కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

-మిగతా 2 లో

# ఈడెన్‌లో ముకుల్ చౌదరి సునామీ..!

మొదటి తరువాయి

దిగిన లక్నో సూపర్ జెయింట్స్.. ఆదిలోనే వికెట్లు కోల్పోయింది. మిచెల్ మార్ష్ (15), ఎయిడెన్ మార్‌క్రమ్ (22), రిషభ్ పంత్ (10) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యారు. ఓ దశలో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన లక్నో.. విజయావకాశాలు సంక్లిష్టం చేసుకుంది. ఇలాంటి సమయంలోనే ముకుల్ చౌదరి అద్భుతం చేశాడు. అసాధారణ హిట్టింగ్‌తో కేకేఆర్‌కు మ్యాచును దూరం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో27 బంతులు ఎదుర్కొన్న ఈ 21 ఏళ్ల ప్లేయర్.. ఏకంగా ఏడు సిక్సర్లు బాదాడు. రెండు ఫోర్లు కూడా కొట్టాడు. దీంతో 200ల స్ట్రైక్ రేటుతో 54 రన్స్ చేసి.. జట్టును గెలిపించాడు. లక్నో విజయానికి చివరి 2 ఓవర్‌లలో 30 రన్స్ అవసరమయ్యాయి. ఈ సమయంలో కామెరూన్ గ్రీన్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ముకుల్ 16 రన్స్ రాబట్టాడు. చివరి ఓవర్ తొలి బంతికి ఆవేశ్ ఖాన్.. సింగిల్ తీశాడు. దీంతో స్ట్రైకింగ్‌లోకి వచ్చిన అతడు రెండో బంతిని స్టాండ్స్‌లోకి పంపించాడు. ఐదో బంతికి సైతం అదే శిక్ష వేశాడు. చివరి బంతికి ఒక్క పరుగు అవసరం కాగా.. బ్యాటుకు బంతి తాకకపోయినా ఇద్దరు బ్యాటర్లూ పరుగు పూర్తి చేశారు. దీంతో లక్నో టీమ్ సంబురాల్లో మునిగితేలింది. 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. కేకేఆర్ బ్యాటర్లలో ఎ.రఘువంశీ (33 బంతుల్లో 45 రన్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

-చిర,చరాస్థులు కూడా లేవు
-సొంత ఇల్లు అంతకన్నా లేదు
-బ్యాకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ



కోల్‌కతా,

మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ముఖ్యమంత్రిగా దాదాపు పదిహేనేళ్లుగా కొనసాగుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఆమెను అందరూ 'దీదీ' అని పిలుస్తారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పటికీ, ఆమె గడుపుతున్న నిరాడంబర జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక ఆదర్శంగా నిలుస్తోందని అంటున్నారు. ఇప్పటికీ తన పేరిట ఒక సొంత ఇల్లు, భూమి లేవని ఆమె వెల్లడించడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భవానీ పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మమత బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసే సమయంలో కూడా ఆమె ఎప్పటిలాగే తన ట్రేడ్‌మార్క్ కాటన్ చీర, హవాయి చెప్పులతో ఎంతో సాదాసీదాగా కనిపించడం అందరినీ ఆకట్టుకుంది.మమతా బెనర్జీ అఫిడవిట్‌లో సమర్పించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఇండియన్ బ్యాంక్‌లో దీదీ పర్సనల్ ఖాతాలో సుమారు రూ.12.4లక్షలు ఉన్నాయి. ఎన్నికల ఖర్చుల కోసం అదే బ్యాంక్‌లో ఉన్న మరో ఖాతాలో రూ.40,000 ఉన్నాయి. అంటే మొత్తం బ్యాంకు నిల్వలు సుమారు రూ.13 లక్షలు. చేతిలో రూ.75,000 నగదు ఉన్నట్లు మమతా బెనర్జీ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీదీ వద్ద కేవలం 9.75గ్రాముల బంగారు ఆభరణాలు మాత్రమే ఉన్నాయి. 2021లో దాని విలువ రూ.88,887 ఉండగా, ప్రస్తుతం బంగారం రేటు పెరగడంతో రూ.1.75లక్షలకు పెరిగింది. మమత బెనర్జీకి సొంత ఇల్లు లేదు. ఎక్కడ వ్యవసాయ భూమి కానీ, నివాస స్థలాలు కానీ లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని ఆమె తన అఫిడవిట్‌లో తెలిపారు.

# కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

మొదటి తరువాయి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు సంబంధించిన ఏజెన్సీలన్నింటినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్లతో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉందనీ, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకుని వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలన్నారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి నిధుల విషయంలో ఇబ్బంది కల్గనివ్వమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, సీఎం కార్యదర్శి మానిక్ రాజ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రిలయన్స్ రిటైల్ వాల్యుయేషన్ భళా

మొదటి తరువాయి

రూపొందించిన జాబితాలో ఈ మూడు కంపెనీల వాల్యుయేషనే మూడో వంతు వరకు ఉంది. ఇక మన దేశానికి చెందిన ఎన్ఎసఈ (2,400 కోట్ల డాలర్లు), టాటా ఈవీ మొబిలిటీ (900 కోట్ల డాలర్లు) 27, 93వ స్థానాల్లో నిలిచాయి.

# భారత జీడీపీ 6.6 శాతానికి తగ్గొచ్చు

ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్




న్యూఢిల్లీ :

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా ఇంధన సెగను పెంచుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 నుంచి 100 డాలర్ల మధ్య ఊగిసలాడటం భారత్‌కు అతిపెద్ద సవాలుగా మారిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. చమురు ధరలు పెరిగితే దేశీయంగా రవాణా భారమై, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని.. దీనివల్ల వృద్ధి రేటుపై ఒత్తిడి పడి 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.6 శాతానికి నెమ్మదించవచ్చని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది. వాణిజ్యపరంగా చూస్తే ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులపై విధిస్తున్న భారీ టారిఫ్‌లు భారత ఎగుమతిదారులకు ప్రతిబంధకంగా మారాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయ వాణిజ్య మార్గాల్లో అస్థిరత ఏర్పడి, సరఫరా గొలుసు దెబ్బతినే అవకాశం ఉంది. ఇది ఎగుమతులపై ఆధారపడిన రంగాలను దెబ్బతీస్తూనే దిగుమతి చేసుకునే ముడి సరుకుల ఖర్చును పెంచి తయారీ రంగాన్ని ప్రతికూలతల్లోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి భారత్ వద్ద పటిష్టమైన విదేశీ మారక నిల్వలు, ఆర్థిక వెసులుబాటు ఉన్నప్పటికీ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే ఈ బఫర్స్ కరిగిపోయే ముప్పు పొంచి ఉంది.

# పోలింగ్ ప్రశాంతం

మొదటి తరువాయి

ఆరుగంటల వరకు అనుమతించారు. ఆ సమయానికి క్యూలో వున్న వారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేసేందుకు అనుమతిచ్చారు.

**కేరళలో**

కేరళలోని 140 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ సాఫీగా, సజావుగా సాగింది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 76శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుత ఎన్నికల్లో అంతకంటే అధికంగానే నమోదైంది. ఈసారి కోయకోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, పలువురు మంత్రులు, నటులు సహా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలో జెన్‌జీ పోలింగ్ బూత్ అందరినీ ఆకట్టుకుంది. తొలిసారి ఓటు వేసిన వారు సెల్ఫీ దిగేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. కాగా తొలిసారి ఓటు వేసిన వారందరికీ ఎన్నికల కమిషన్ 'స్వీట్ సర్‌ప్రైజ్' ఇచ్చింది. ప్రతి జిల్లాలో మొదటసారి ఓటు వేసిన 200మందికి హల్వా పంచింది.

ఎన్నికల అధికారి మృతి

అసోంలోని సోనిత్‌పూర్ జిల్లాలో ఎన్నికల అధికారి దేబెన్ హోరో (45) మరణించి వుండగా కనుగొన్నారు. ఆయన మరణానికి కారణమేంటో ఇంకా నిర్ధారించలేదు. నాడార్ నియోజకవర్గంలో రెండో పోలింగ్ అధికారిగా ఆయనను నియమించారు. గురువారం ఉదయం ఆయన మంచంపై స్పృహ లేకుండా పడి వుండగా చూశారు. వెంటనే అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయింది. ఆయన మరణించారని అధికారులు తెలిపారు.

పోలింగ్‌బూత్‌లో వీడియో : ఎఫ్ఐఆర్ నమోదు

పోలింగ్ బూత్‌ల్లో ఫోన్లు నిషిద్ధం. కేంద్రంలోకి వెళ్ళేముందు ఫోన్లు, బ్యాగ్‌లు సహా అన్ని వస్తువులను ఇచ్చి లోపలకు వెళ్లాలని ఈసీ కూడా స్పష్టంగా పేర్కొంది. కానీ అస్సాంలోని కర్బి అనగ్లాంగ్ జిల్లా యంత్రాంగం గురువారం ఇందుకు సంబంధించి పోలీసు ఫిర్యాదు చేసింది. ఒక పోలింగ్ స్టేషన్‌లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను చూపిస్తున్నట్లుగా వున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిందని అధికారులు తెలిపారు. దిఫూ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లో తీసిన వీడియోగా భావిస్తున్నారు. వెంటనే దీనిపై విచారణకు ఆదేశించామని చెప్పారు. ప్రజా ప్రాతినిధ్యచట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేశారు.

పుదుచ్చేరిలో


పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాల్లోనూ భారీగా పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో ఇంత భారీ స్థాయిలో (86శాతం) ఓటింగ్ నమోదవడం 2006 తర్వాత ఇదే తొలిసారి. వీవీప్యాట్ యంత్రంలోని బ్యాటరీ నుంచి పొగ వస్తుండడంతో కరైకల్‌లో ఒక పోలింగ్ బూత్‌లో కాసేపు పోలింగ్ ఆగింది. ఆ బ్యాటరీని మార్చి కొత్తది పెట్టిన తర్వాత పోలింగ్‌ను పునరుద్ధరించారు.

వామపక్ష సంఘటనకు మళ్ళీ అధికారం

రాష్ట్రంలో వామపక్ష సంఘటన తిరిగి అధికారంలోకి వస్తుందని సీపీఐ కేరళం రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం పేర్కొన్నారు. వట్టియురకవులో తన ఓటు హక్కు వినియోగిం చుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను స్పష్టంగా అర్థం చేసుకున్న ప్రజలు తమ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, దేశ సార్వభౌమాధికారం వంటి కీలకమైన స్తంభాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి ఆందోళనలే ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. దేశంలో, అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితులను ప్రస్తావిస్తూ, యుద్ధ మేఘాల నడుమే ప్రజలు ఓటు వేసారన్నారు. వామపక్షాలే విశ్వసనీయమైన ప్రత్యామ్నాయమని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఇచ్చే శుష్క వాగ్దానాలు కాకుండా నిరుపేదలకు ఆశ, భద్రత కల్పించేది వామపక్షాలేనని అన్నారు.

# బెంగాల్ మార్పు కోరుకుంటోంది.

- రాష్ట్రం అంతటా నందిగ్రామ్ ఫలితాలే
- భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోంది
- బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం
- తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం



న్యూఢిల్లీ,

పశ్చిమబెంగాల్ లోని హల్దియాలో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ ( పార్టీపై విమర్శలు గుప్పించారు. ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో సీఎం మమతాబెనర్జీ ఓటమిని గుర్తుచేస్తూ.. ఈసారి పశ్చిమబెంగాల్ రాష్ట్రం అంతటా అదే ఫలితం పునరావృతమవుతుందని చెప్పారు. పశ్చిమబెంగాల్ మార్పును కోరుకుంటోందని, ఈ క్రమంలో బీజేపీ భారీ విజయాన్ని చూస్తామని వ్యాఖ్యానించారు.నందిగ్రామ్‌లో ఐదేళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు భవానీపూర్‌తోపాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుందని ప్రధాని జోస్యం చెప్పారు. ఇవి సాధారణ ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తామని, బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవని మోదీ వ్యాఖ్యానించారు. ఒక్కసారి డబుల్-ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఇక్కడ అమల్లోకి వస్తాయని చెప్పారు. బెంగాల్ ప్రజలకు ఆరు హామీలు ఇస్తున్నానని అన్నారు. అన్యాయానికి గురైన ఆడబిడ్డల కేసులను తిరగదోడుతామని, అవినీతికి సాయం చేస్తున్న చట్టాలను రూపుమాపుతామని తెలిపారు. తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని ప్రధాని అన్నారు. శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కల్పిస్తామని, చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతామని చెప్పారు. ఒక్కసారి బీజేపీ అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

# రేవంత్ కన్నా...కేసీఆర్ పాలనే బెటర్

మొదటి తరువాయి

భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

# పొంగులేటి కాదు..పొంగులూటీ

మొదటి తరువాయి

పడతాయని చెప్పి ఏడాది దాటిందని.. అవి తుస్సుమన్నాయని సెటైర్లు గుప్పించారు. ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో హరీశ్‌రావు పర్యటించారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయట పెట్టారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అని వ్యగ్యంగా మాట్లాడారు. ఆయన క్రషర్‌లో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డినే స్వయంగా బయటపెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షం కాదని.. తామే అన్ని విషయాలు వెలుగులోకి తెస్తామని అసెంబ్లీలోనే సీఎం చెప్పారని అన్నారు. సీఎం ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు వెళ్లి.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతులు లేవని నివేదిక ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు.. ఇదంతా మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమని ఆరోపించారు. తాము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాతనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్‌పై రంగు వేసి, కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను 22 ఏ లో పెట్టి రక్షించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ భూములను ఎందుకు దాస్తున్నారని.. వీటి గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టులో చెప్పారని.. మరి ఎందుకు అక్కడి భూమిలో రోజుకోక కొత్త బోర్డు వెలుస్తోందని నిలదీశారు. ఇవి ప్రభుత్వ భూములు అయితే ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అడిగారు. రెవెన్యూ మంత్రిగా పొంగులేటి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు.

అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# అర్రైవ్ అలైవ్ కార్యక్రమం" పై రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ





### జిల్లా పోలీసు అధికారులతో సమావేశం అర్రైవ్ అలైవ్ కార్యక్రమం అమలుపై ఎస్పీ గారి ఆదేశాలు

**మిడ్జిల్, ఏప్రిల్ 09, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కె.రామకృష్ణ, IAS గారు మరియు రాష్ట్ర డిజిపి శ్రీ శివధర్ రెడ్డి, IPS గారు గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు మరియు జిల్లా ఎస్పీలతో కలిసి "అర్రైవ్ అలైవ్ కార్యక్రమం" అమలు మరియు సిద్ధతలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యచరణలో "అర్రైవ్ అలైవ్ కార్యక్రమం"ను 13.04.2026 నుండి 18.04.2026 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై



అవగాహన పెంపు, ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశగా సమగ్ర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేయబడినవి. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ గారు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు జిల్లాలో "అర్రైవ్ అలైవ్ కార్యక్రమం"ను విజయవంతంగా అమలు చేయడానికి తగిన చర్యలు చేపడతామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎస్పీ గారు జిల్లా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారు మరియు డీజీపీ గారు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం "అర్రైవ్ అలైవ్ కార్యక్రమం"ను తమ తమ పరిధిలో సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు వివరించి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అలాగే "అర్రైవ్ అలైవ్ కార్యక్రమం"ను విజయవంతంగా అమలు చేసి జిల్లాలో జరిగే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించే దిశగా ప్రతి అధికారి కృషి చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ సమావేశం నందు అదనపు ఎస్పి చీదీ రత్నం, DSP వెంకటేశ్వర్లు, ఐజ=దీ ఐూా రమణా రెడ్డి, వర్టికల్ ఐూా బాలాజీ, DCRB ఇన్స్పెక్టర్ నర్సింలు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, మహబూబ్ నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా పీఎం సంసద్ ఖేల్ క్విట్ మహోత్సవం

● పాల్గొన్న పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**మిడ్జిల్, ఏప్రిల్ 09, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** ఉర్కొండ మండల కేంద్రంలో పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవితానికి చదువుతో పాటు క్రీడలు కూడా కీలకమని ఆయన సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రేరణతో నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అలాగే స్థానిక పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.
ఉర్కొండ మండలంలో ఉన్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ టోర్నమెంట్ మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్కొండ సర్పంచ్ మంజుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ పోలే రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, ఆంజనేయులు మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షులు పూర్ణదీప్ రెడ్డి, గిరిజన మోర్చా అధ్యక్షులు కిరణ్ కుమార్, కిషన్ మోర్చా అధ్యక్షులు వెంకట్రెడ్డి, పీటీ జగన్ తదితరులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# 12వ వార్డు శాంతినగర్ కాలనీలో హెల్త్ క్యాంప్





● ప్రారంభించిన కౌన్సిలర్ నాగిళ్ల జగన్..

**ఆమనగల్లు, ఏప్రిల్ 09(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో శాంతినగర్ కాలనీ కోట మైసమ్మ గుడి ఆవరణలో 99 రోజుల"ప్రజా పాలనబి ప్రగతి ప్రణాళిక"లో భాగంగా హెల్త్ క్యాంపుని గురువారం వైద్య సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్, 5వ వార్డు కౌన్సిలర్ ప్రముఖ సంఘ సేవకులు, పాపిశెట్టి రాముతో కలిసి ఈ హెల్త్ క్యాంపు ను ప్రారంభించారు. కాలనీ వాసులకు 120 మంది వరకు వివిధ రకాల పరీక్షలను నిర్వహించి,వారికి ఉచితముగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మైమూనా,ఎంపిహెచ్ఎస్ తిరుపతి రెడ్డి,అలీమ్,ఏఎన్ఎం సీతమ్మ, మాధవి,ఆశ వర్కర్లు అలివేలు,నిర్మల, సంతోష, లక్ష్మి , విజయ, సల్మా,గుజ్జరి శ్రీనివాసులు, మోహన్ సింగ్, బ్రహ్మం రామకృష్ణ,సాయి,కిరణ్ కుమార్,తాళ్ల రఘు,శ్రీను నాయక్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్యానికి క్రీడలే మార్గం

● బాలరాజు స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్



**మిడ్జిల్, ఏప్రిల్ 09 (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకుడు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడకల బాలరాజు హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ, మనిషి ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మానసిక ఉల్లాసం మరియు శారీరక దృఢత్వం పొందాలంటే క్రీడలు తప్పనిసరి అని అన్నారు. చదువుతో పాటు క్రీడలను కూడా ప్రాధాన్యంగా తీసుకోవాలని యువతకు సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రేరణతో జరుగుతున్న ఈ సంసద్ ఖేల్ మహోత్సవ్ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే స్థానిక పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మిడ్జిల్ మండలంలోని క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు ఇది మంచి వేదిక అవుతుందని బాలరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ సంసద్ ఖేల్ కోఆర్డినేటర్లు రాజేశ్వర్, పల్లె తిరుపతి, మండల ఇన్‌చార్జ్ నరేష్ నాయక్, ఎంపీడీవో గీతాంజలి, ఎంపీఓ రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శులు వాసుదేవ్, శేఖర్, ఆర్గనైజర్స్ ప్రశాంత్, రాంబాబు, శివ, సంతోష్ నాయక్ తదితరులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

● పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎంఆర్ఎఫ్ అందిస్తామన్న ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్9(నేటి దర్శిని బ్యూరో):** తెలంగాణ రాష్ట్రంలోబలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడకుండా ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా ప్రభుత్వం అప్పన్న హస్తం అందిస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ తెలిపారు. హన్మకొండ జిల్లా కాజీపేట మండలం పరిధిలోని 'మా' గార్డెన్స్ నందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 44, 45, 46, 64 డివిజన్లకు చెందిన 80 మంది కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.80,09,280 విలువైన చెక్కులను, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 18 మందికి రూ. నాలుగు లక్షల 30 వేల రూపాయలు విలువైన చెక్కులను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని, రాష్ట్రంలో రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళ ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. అర్హులైన పేద ప్రజలందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎవరికీ ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకులను హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలను పూర్తిగా పారదర్శకంగా అందజేస్తామని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సమాజంలో ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం: జిల్లా కలెక్టర్




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 9 (నేటి దర్శిని బ్యూరో):** సమాజంలో ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం అత్యంత కీలకమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు .ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంజీఎం వద్ద ఏర్పాటుచేసిన మానవహారం లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుందన్న విషయాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ పై అవగాహన, సురక్షిత జీవన విధానంతోనే నివారణ సాధ్యమని సూచించారు. కేఎంసీ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, డిఎం అండ్ హెచ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంపాదకీయం


# ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు !



ట్రంప్, నెతన్యాహులు కలిసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహ్రైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణమైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# పాక్ వల్లే లెబనాన్‌పై అయోమయం!

- ఇరాన్‌కు ఒకలా, అమెరికాకు మరోలా ఒప్పంద అంశాలు




**న్యూఢిల్లీ ఏప్రిల్09 (నేటి దర్శిని):** పాకిస్థాన్‌కు విజయోత్సవ రోజు. ఎందుకంటే అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడం ద్వారా ఎన్నో ఏండ్ల తర్వాత అతిపెద్ద దౌత్య విజయాన్ని పాక్ సాధించింది. అయితే ఆ ఆనందం పాక్‌కు ఎంతోసేపు నిలవలేదు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భారీ స్థాయిలో దాడి జరపడంతో కాల్పుల విరమణ ఒప్పందం ఆదిలోనే నీరుగారిపోయింది. ఇరాన్ మిత్రదేశమైన లెబనాన్‌పై జరిగిన ఈ దాడి కారణంగా వందలాది మంది మరణించారు. ఇప్పుడు గందరగోళమంతా కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగమా కాదా అన్నదే. ఉభయ పక్షాలకు ఒప్పందాన్ని వివరించే బాధ్యత వహించిన పాకిస్థాన్ ఇప్పుడు ఈ దుమారానికి కేంద్రబిందువుగా మారింది. మార్చి 2 నుంచి ఇజ్రాయెల్ దాడులను ఎదుర్కొంటున్న లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందంలో ఎన్నడూ భాగం కాదని అమెరికా, ఇజ్రాయెల్ చెబుతున్నాయి. అయితే ఇరాన్ మాత్రం బుధవారం అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ గురించి పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ప్రకటన చేస్తూ లెబనాన్‌తోసహా అంతటా ఇది వర్తిస్తుందని స్పష్టంగా ప్రకటించారని వాదిస్తున్నది. ఇరాన్, అమెరికా తమ మిత్రదేశాలతో కలిసి లెబనాన్, ఇతర ప్రాంతాలతో సహా అన్ని చోట్ల తక్షణమే కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది అని షరీఫ్ బుధవారం ట్వీట్ చేశారు. నిమిషాల వ్యవధిలోనే దీన్ని ఇజ్రాయెల్ స్వాగతిస్తూ అయితే లెబనాన్ ఇందులో భాగం కాదని స్పష్టం చేసింది. అంతేగాక గంటల్లోనే లెబనాన్‌పై భీకరం దాడులు చేసింది.

## పాక్ మధ్యవర్తిత్వంపై మాకు నమ్మకం లేదు

- ఇజ్రాయెల్ రాయబారి

**జెరూసలేం,ఏప్రిల్09 (నేటి దర్శిని):** ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలకు ఇస్లామాబాద్ వేదికగా మారింది. ఈ తరుణంలో ఇండియాలో ఇజ్రాయెల్ రాయబారి రీవెన్ అజార్ పాకిస్థాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను ఇజ్రాయెల్ నమ్మటం లేదన్నారు. చర్చల సందర్భంగా తలెత్తే పరిస్థితిని పరిష్కరించడానికి అమెరికా మిత్రులపై ఆధారపడుతున్నామని చెప్పారు.



పశ్చిమాసియాలో ఇరాన్‌తో సాగుతున్న యుద్ధంపై బుధవారం కీలక ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. రెండు వారాలపాటు తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటించిన అమెరికా-ఇరాన్.. ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలకు సిద్ధమవుతున్నాయి. యుద్ధ సంక్షోభంపై ఇరు వర్గాల మధ్య జరగనున్న ముఖాముఖి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వబోతున్నది.

## కొన్ని ఆలయాల్లో పురుషులకూ ప్రవేశం లేదు

- శబరిమల కేసులో సుప్రీంకోర్టులో కేంద్రం వాదనలు



**న్యూఢిల్లీ ఏప్రిల్09 (నేటి దర్శిని):** శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై ఎలాంటి నిబంధన ఉందో.. కేరళలోని కొన్ని దేవాలయాల్లో పురుషుల ప్రవేశంపైనా నిషేధముందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. శబరిమల ఆలయంలో ప్రవేశంపై ఆంక్షల్ని కేవలం లింగబేధంతో చూడరాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు.భారతదేశంలో మతపరమైన హక్కులు, స్వేచ్ఛలకు సంబంధించిన వివిధ చట్టపరమైన ప్రశ్నలను పరిశీలిస్తున్న రాజ్యాంగ ధర్మాసనం ముందు గురువారం కేంద్రం తన వాదనను వినిపించింది. శబరిమల కేసులో 2018 నాటి సుప్రీంకోర్టు తీర్పును తుషార్ మెహతా తప్పుబట్టారు. పురుషులు ఉన్నతమైన వారని, మహిళలు తక్కువ స్థాయిలో ఉంటారనే భావనతో ఆనాడు శబరిమల తీర్పు వెలువడిందని ఆయన అన్నారు.

## వెంటనే చేరే వాళ్లకే ప్రాధాన్యం..

- ఉద్యోగ మార్కెట్‌పై తాజా సర్వే వెల్లడి



**న్యూఢిల్లీ ఏప్రిల్09 (నేటి దర్శిని):** భారత ఉద్యోగ మార్కెట్ కీలకమైన మార్పులకు లోనవుతున్నది. ఫౌండ్‌ఇట్ సర్వే ప్రకారం వెంటనే ఉద్యోగంలో చేరే వారికి కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తేలింది. పెరుగుతున్న పోటీ వాతావరణంలో తక్కువ సమయంలో లక్ష్యాలను చేరుకొనేందుకు కంపెనీలు ఈ విషయానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిసింది. 2022 నుంచి ఈ పోకడ 58 శాతం పెరిగింది.అయితే అలాంటి అభ్యర్థుల లభ్యత కేవలం 12 శాతం మాత్రమే పెరిగింది. దీంతో ప్రతిభావంతులను ఉద్యోగులుగా చేర్చుకొనే విషయం సంస్థలకు సవాల్‌గా మారింది. దీంతో వాటి వ్యాపార ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి. 'వెంటనే చేరేవాళ్లు', 'షార్ట్ నోటీస్ (30 రోజుల్లోపు)', 'అత్యవసర నియామకం' లాంటి పదాల వాడకం జాబ్ మార్కెట్‌లో బాగా పెరిగింది.

## పెళ్లి మండపం నుంచే ఓటు వేయడానికి వచ్చిన నూతన వధూవరులు



**తిరువనంతపురం ఏప్రిల్09 (నేటి దర్శిని):** కేరళలో నేడు ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో అప్పుడే పెళ్లి చేసుకున్న నూతన వధూవరులు దివ్యశ్రీ, అశ్వంత్ లంబోధరన్‌లు వారు వివాహం చేసుకున్న పెళ్లి మండపం నుంచి నేరుగా పోలింగ్ బూత్ వద్దకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఘటన తిరువనంతపురంలోని వాజుముట్టం పోలింగ్ బూత్ వద్ద జరిగింది. పెళ్లి దుస్తులోనే ఉన్న ఈ నూతన వధూవరుల్ని నిర్మల్ హరింద్రన్ తన కెమెరాలో క్లిక్‌మనిపించారు.

# రేపు మూడు మండలాల్లో ఎంపీ డీకే అరుణ పర్యటన


- చెరువుల సుందరీకరణ పనుల పరిశీలన, భూమిపూజ
- నర్వలో వాటర్ ప్లాంట్, సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు
- బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



**ఆత్మకూర్, ఏప్రిల్09 (నేటి దర్శిని):** మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ శుక్రవారం ఆత్మకూర్, అమరచింత, నర్వ మండలాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆత్మకూర్ పట్టణంలోని పరమేశ్వర చెరువు సుందరీకరణ పనులను ఆమె పరిశీలించనున్నారు. అనంతరం పత్రికా విలేకరులతో సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమరచింత పట్టణంలోని పెద్ద చెరువు సుందరీకరణ పనులకు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొననున్నారు. తరువాత మధ్యాహ్నం 1.30 గంటలకు నర్వ మండలంలోని నాగిరెడ్డి పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే నర్వ, లంకాల గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూర్, అమరచింత, నర్వ మండలాల పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని ఎంపీ డీకే అరుణకి ఘన స్వాగతం పలకాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి కోరారు.

# లెబనాన్‌తో శాంతి చర్చలకు సిద్ధం!

- నెతన్యాహు ప్రకటన
- హెజ్బొల్లా ఆయుధాలు వీడాలని స్పష్టీకరణ



**టెల్ అవీవ్, ఏప్రిల్09 (నేటి దర్శిని):** లెబనాన్‌పై భీకర దాడుల తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు గురువారం కీలక ప్రకటన చేశారు. లెబనాన్‌తో ప్రత్యక్ష శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారు. లెబనాన్ నుంచి పదేపదే విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో ఆ దేశంతో 'వీలైనంత త్వరగా' శాంతి చర్చలు జరిపేందుకు క్యాబినెట్‌కు అనుమతి ఇచ్చానని వెల్లడించారు. అయితే లెబనాన్‌లోని తిరుగుబాటు సంస్థ హెజ్బొల్లా ఆయుధాలు వీడాలన్నదే చర్చలలో ప్రధాన అంశమని స్పష్టంచేశారు.ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని, హెజ్బొల్లాపై తమ దాడులు కొనసాగుతాయని ప్రకటించిన నెతన్యాహు.. తాజాగా శాంతి చర్చలకు ముందుకు రావడం గమనార్హం. అంతకుముందు లెబనాన్ వ్యాప్తంగా జరిగిన భీకర దాడుల్లో హెజ్బొల్లా అధిపతి నయీమ్ ఖాసెమ్ మేనల్లుడు, సన్నిహిత సహాయకుడు మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ తన సైనిక దాడులను కొనసాగిస్తుందని నెతన్యాహు గురువారం స్పష్టం చేశారు.

# ఘనంగా"ఎన్ఎస్ యుఐ"56 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఆమనగల్లు,ఏప్రిల్ 09(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఎన్ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ యుఐ56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి,ఎన్ ఎస్ యు ఐ జెండాను ఆవిష్కరించి,కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఎండి ఫరీద్ మాట్లాడుతూ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఎంతోమంది తొలితరం నాయకులకు ఎన్ ఎస్ యు ఐ ఒక శక్తివంతమైన వేదికను కల్పించిందన్నారు. ఇక్కడ తమ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారిలో అనేకులు నేడు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా,ఎమ్మెల్సీలుగా మరియు ముఖ్యమంత్రులుగా కూడా దేశానికి సేవలు అందిస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఎన్ఎస్యుఐ లక్షలాది మంది విద్యార్థులకు వారి విద్యాపరమైన ప్రస్థానంలో సహాయపడింది.వారిలో అనేకులు ఇప్పుడు దేశ నిర్మాణంలో తమ వంతు కృషి చేస్తున్నారని, విద్యార్థుల సమస్యలను లేవనెత్తడంలోనూ మన దేశ సామాజిక ఐక్యతను పరిరక్షించడంలోనూ ఎన్ఎస్ యుఐ ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెలుగమల్ల జగన్,కడ్తాల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్చ నాయక్,కొత్తకుంట తండా ఉపసర్పంచ్ కేతావత్ సురేష్ నాయక్, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణా నాయక్, ఎన్ ఎస్ యు ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్, అలీమ్,నజీర్, కండే సాయి, కాలే మల్లయ్య, ఏఎంసి డైరెక్టర్ శ్రీశైలం,కుమార్ గౌడ్,మహేష్ ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యం ప్రదర్శించి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ..



క్రీడలు ప్రారంభోత్సవం చేస్తున్న ఎంపి డీకే.అరుణ

- అందుకే ప్రధాని సంసద్ ఖేల్
- క్రీడలకు కేంద్రం ప్రోత్సాహంఎంపీ డికే.అరుణ
- పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్, ఏప్రిల్0 9,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో)** నారాయణపేట జిల్లా: గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసి వారి సత్తాను ప్రపంచానికి చాటే ఉద్దేశ్యంతోనే ప్రధాని సంసద్ ఖేల్ ఉత్సవాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదని పాలమూరు ఎంపీ డి కే అరుణ అన్నారు.గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ప్రధాని సంసద్ ఖేల్ ఉత్సవాలను బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ,రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి,బి.కొండయ్య,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,జిల్లా ఖేల్ ఉత్సవాల కన్వీనర్ ముచ్చర్ల జనార్ధన్ ,జిల్లా కన్వీనర్ డోకూరు



పార్లమెంట్ ఇంచార్జ్. ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ

తిరుపతి రెడ్డి లతో కలిసి ఘనంగా ప్రారంబించారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ డి కే అరుణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక దేశ క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నారని అన్నారు.ప్రధాని ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు.దాంతో గ్రామీణ స్థాయిలో ఆణిముత్యాలు ఎందరో ఉన్నారని వారిని వెలికి తీసి ప్రపంచానికి పరిచయం చేయడం కోసమే దేశవ్యాప్తంగా క్రీడలు నిర్వహిస్తున్నారని అన్నారు.ప్రతి గ్రామం నుంచి క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యం చాటాలని కోరారు.వచ్చే ఏడాది మరింత ఘనంగా పార్లమెంటు పరిధిలో క్రీడా పోటీలు నిర్వహిస్తామని అన్నారు.ఈ క్రీడా పోటీల్లో క్రీడాకారులు తమ నైపుణ్యం క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల జిఆర్ రెడ్డి కౌన్సిలర్లు,పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్,జిల్లా,నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 9 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు ఈనెల 11న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. హెచ్ సి ఏ ఆధ్వర్యంలో నిర్వహించే బి ,డివిజన్ టు- డే లీగ్ పోటీలో పాల్గొనే జట్టులకు ఉమ్మడి వరంగల్ జిల్లా కరుణాపురం సమీపంలోని డబ్ల్యు డి సి ఏ మైదానంలో ఉదయం 11 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు మీ-సేవ ధ్రువీకరించిన సర్టిఫికెట్ ,ఒరిజినల్ ఆధార్ కార్డు తో పాటు సొంత కిట్ యూనిఫామ్ లతో హాజరుకావాలని ఆయన సూచించారు.

# వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క

- మహబూబాబాద్ కలెక్టరేట్లో నూతనంగా నిర్మించిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 9 (నేటి దర్శిని బ్యూరో):** వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ కలెక్టరేట్లో నూతనంగా నిర్మించిన వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వృద్ధుల పోషణ ,సంరక్షణలో ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళుతున్నమని, వృద్ధులకు వైద్యం, ఇతర అవసరాల్లో అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ డే కేర్ సెంటర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంటాయని ,వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమయంలో వృద్ధులకు అల్పాహారము వైద్య సహాయం అందజేయడం జరుగుతుందని, వృద్ధులు తమ ఆత్మీయ అభిమానాన్ని తోటి వారితో పంచుకోవడానికి ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. త్వరలో ప్రతి నియోజకవర్గానికి ఒక డేకేర్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# జనగామను పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి


- రైతులు మొక్కజొన్నను మధ్య దళారులకు అమ్మకండి
- చేర్యాల మార్కెట్‌కు వెళ్లి,
- రూ. 2400 మద్దత ధర పొందండి కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదు
- తరిగొప్పుల, నర్మెటలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తా



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 9 (నేటి దర్శిని బ్యూరో):** రైతులు మొక్కజొన్న పంటను, మధ్య దళారులకు తక్కువ ధర లకు అమ్మి నష్టపోవద్దని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజే శ్వర్ రెడ్డి సూచించారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ నియోజకవర్గంలోని తరిగొప్పుల మండలంలోని అక్క రాజు పల్లి, సోలిపురం, అంకుశాపురం గ్రామాలతోపాటు నర్మెట్ట మండలంలోని మచ్చుపహాడ్, వెల్దండ గ్రామాల్లో ఐకెపి కేంద్రాలను ఎమ్మెల్యే ముఖ్య అతిధి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో కొంతమంది దళా రులు రైతులను మోసం చేస్తూ రూ.1700, రూ.1800 వంటి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. అలాంటి వారికి మొక్కజొన్న అమ్మకూ డదని స్పష్టం చేశారు. చేర్యాల మార్కెట్‌కు వెళ్లి అమ్ముకోవాలని, స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యే వరకు ఓపికగా వేచి ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అసలు సమయంలో వర్షాలు పడక, అకాల వర్షాలు పడటంతో రైతు లు తీవ్ర నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సన్న ఒడ్లకు సంబంధించి రూ.500 మద్దతు వస్తుందనీ,రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మొక్కజొన్న విషయంలో ఇటీవల చేర్యాల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన సమయంలో రైతులు పలు సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల మండలాల నుంచి వచ్చిన రైతుల మొక్కజొన్నను కొనుగోలు చేయడం లేదని రైతులు తమకు తెలియచే శారని చెప్పారు. చాలా గ్రామాలు చేర్యాల మార్కెట్‌కు 5 నుంచి 6 కిలోమీటర్ల దూరం లో ఉండటంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.సీఎం రాకను దృష్టిలో పెట్టుకుని హడావిడిగా కేంద్రాన్ని తెరిచారనీ, పది రోజులు అయినా ఇప్పటివరకు భారదన్ ఇవ్వలేదనీ,రైతులు తీసుకువచ్చిన మొక్కజొన్నను కొనడం లేదని, తీవ్రంగా అన్యాయం జరుగుతోందనీ., ఎండీ శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారంకు కృషి చేశానన్నారు.ఈ పరిస్థితిపై తక్షణమే స్పందించి మద్దత్తు ధరకు మొక్కలు కొనుగోలు చేయాలని కచ్చితమైన ఆర్డర్లు కూడా వచ్చాయని పేర్కొన్నారు. తరిగొప్పుల, నర్మెట, బచ్చన్నపేట రైతులెవ్వరూ రూ.1800కి అమ్మ వద్దని స్పష్టం చేశారు. మొక్కజొన్నకు రూ.2400 ధరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చేర్యాల మార్కెట్‌లో షెడ్లలో మొక్కజొన్నను అరబోసుకునే పరిస్థితి ఉందని, మౌలిక వసతుల సమస్యలు ఉన్నాయని చెప్పారు.తరిగొప్పుల, నర్మెట మండలాల్లో ప్రత్యేకంగా మొక్క జొన్న కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రయత్నం చేస్తున్నామని తెలి పారు.రైతులు మొక్కజొన్న ను మధ్య దళారులకు అమ్మ వద్దని గట్టిగా సూచించారు. రూ.1700, రూ.1800 వంటి తక్కువ ధర లకు అమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. చేర్యాలకైనా వెళ్లాలని, స్థానికంగా కొనుగోలు కేంద్రాలు తెరుచుకునే వరకు వేచిచూడండని రైతులకు విజ్ఞప్తి చేశారు.రైతుల ప్రయోజనాల కోసం తన ప్రయత్నం నిరంతరం కొనసాగు తుందని ఎమ్మెల్యే పల్లా స్పష్టం చేశారు.పార్టీలకు అతీతంగా అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం అందరం కలిసి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# 50 ఏళ్ల నుంచి గ్రామానికి వలస పక్షులు....!

- పక్షులకు ఆతిథ్యమిస్తున్న మేచరాజుపల్లి గ్రామం



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 9 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లా నెల్లికుదురు మండల పరిధిలోని మేచరాజు పల్లి గ్రామానికి ప్రతి సంవత్సరం 2 నుంచి 3 వేల పక్షులు వలస వస్తుంటాయి. ఈ గ్రామానికి ప్రతి సంవత్సరం వేసవి సీజన్లో ఉత్తర భారతదేశం నుంచి పక్షులు వస్తుంటాయి. ఈ పక్షులు 50 సంవత్సరాల నుంచి ఈ గ్రామానికి అతిధులుగా వస్తుంటాయి. గ్రామంలో నీ, చెట్ల మీద పక్షులు గూళు ్ళ ఏర్పాటు చేసుకొని సంతాన ఉత్పత్తి జరుపుతాయి. పిల్లలు పెద్దవయిన తర్వాత వర్షాకాల సీజన్లో తిరిగి వచ్చిన ప్రాంతానికి వెళ్లిపోతుంటాయి. ఈ గ్రామస్తులు పక్షుల కోసం చెట్లను కొట్టకుండా నియమ నిబంధనలు ఏర్పాటు చేసుకున్నారు. అలాగే పక్షుల దాహం తీర్చడానికి గ్రామం కూడళ్ళలో నీటి కుండీలు ఏర్పాటు చేశారు. పక్షులను ఎవరు వేటాడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ వలస వచ్చే పక్షులను ఈ ఇంటర్ మై గ్రేటరీ పక్షులను "ఎర్ర కాళ్ళ కొంగలు" అని పిలుస్తారు. ఈ పక్షులకు ఆతిథ్యము ఇవ్వడంపై గ్రామస్తులను అభినందిస్తున్నారు. వలస పక్షుల ఆతిధ్య విధానం పై ఆరు నెలల నుంచి డాక్యుమెంటరీ రూంపొందిస్తున్నమని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ శర్మ తెలిపారు.

# ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర అంగన్వాడీలదే: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

- పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ సులభతరం
- అంగన్వాడీ టీచర్ల పని తీరు మెరుగుపర్చేందుకు నూతన స్మార్ట్ ఫోన్ల పంపిణీ
- పిల్లలను స్వంత బిడ్డలుగా చూసుకోవాలి -వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- అంగన్వాడీ టీచర్లకు 146 మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎంపీ , చైర్మన్ , ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 8 (నేటి దర్శిని బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్య ఇస్తున్నారని, అంగన్వాడి కేంద్రాల్లోని ప్రీ స్కూల్స్ ఏర్పాటు చేసి చిన్నారులకు ఇంగ్లీష్ మీడియం లో బోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా ప్రీ స్కూల్స్ నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా హన్మకొండ జిల్లా కాజీపేట మండలం పరిధిలోని మడికొండ లోని 'మా' గార్డెన్స్ నందు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని హన్మకొండ జిల్లా హసన్పర్తి, కాజీపేట, ఐనవోలు మండలాలకు చెందిన 146 మంది అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూపిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. చిన్నారులకు అత్యధిక పోషక విలువలు కలిగిన బాలామృతం అందిస్తున్నట్లు చెప్పారు. మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రీ స్కూల్స్ ఏర్పాటు చేసి చిన్నారులకు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు అనుబంధంగా ప్రీ స్కూల్స్ నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల పోషణ, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.అంగన్వాడీ టీచర్లకు అందజేస్తున్న మొబైల్ ఫోన్ల ద్వారా పోషణ్ ట్రాకర్ యాప్ సహాయంతో పిల్లల ఆరోగ్య వివరాలు, పోషకాహార కార్యక్రమాల సమాచారాన్ని సులభంగా నమోదు చేసి పై అధికారులకు పంపే అవకాశం కలుగుతుందని చెప్పారు. దీంతో సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు అందుతాయని పేర్కొన్నారు.గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్యమైన బాధ్యత అంగన్వాడీ సిబ్బందిదేనని, వారి సేవలను ప్రభుత్వం గుర్తిస్తూ అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నదని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం , మహిళల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.అంగన్వాడీ సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా సీడీపీఓ స్వరూప రాణి, సూపర్వైజర్లు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి అవగాహన ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 9(నేటి దర్శిని బ్యూరో):** ప్రజల్లో హెచ్ఐవి పై మరింత విస్తృతమైన అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా హెచ్ ఐ వి అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధి నియంత్రణకు వైద్య సిబ్బంది చేస్తున్న సేవలను కొనియాడారు. వ్యాధి నివారణ, చికిత్స గురించి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకులాల్లో సి.ఇ.సి గ్రూప్ మార్పు వద్దు

- బీసీ సంక్షేమ సంఘం డిమాండ్



**దేవరకొండ, ఏప్రిల్ 9 నేటి దర్శిని ప్రతినిధి :** దేవరకొండలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గురుకుల పాఠశాలల నుంచి సి.ఇ.సి గ్రూప్‌ను ఇతర పాఠశాలలకు మార్చకూడదని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, దేవరకొండ బాలుర గురుకుల పాఠశాల, కొండమల్లేపల్లి బాలికల గురుకుల పాఠశాలల నుంచి సి.ఇ.సి గ్రూప్‌ను మార్చడం సరైన నిర్ణయం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 83 గురుకుల పాఠశాలల్లో ఇలాంటి చర్యలు చేపట్టడం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.డిమాండ్ ఉన్న గ్రూపులను ఇతర పాఠశాలలకు మార్చడం వల్ల మారుమూల ప్రాంతాల్లో చదువుతున్న బీసీ విద్యార్థులు నష్టపోతారని, మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ అంశాన్ని తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ విషయాన్ని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణకు తెలియజేసినట్లు పేర్కొంటూ, అన్ని గ్రూపులను సమానంగా కొనసాగిస్తూ విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్, పిరికేటి శ్రీనివాస్, చారి పున్న భిక్షమయ్య, యాదయ్య, చారి శివ తదితరులు పాల్గొన్నారు.'

## గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక అవసరం

- ఎమ్మెల్యే బాలు నాయక్






**చింతపల్లి ఏప్రిల్ 9 నేటి దర్శిని ప్రతినిధి :** చింతపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధ్యక్షత వహించారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సర్పంచులు తమ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల అవసరాలను సమగ్రంగా గుర్తించాలని సూచించారు. పంచాయతీల ఆదాయం, బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అధికారులను సూచించారు. ప్రతి గ్రామంలో మంచినీటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రతి పంచాయతీని నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజూ సందర్శిస్తూ, గ్రామస్థులతో నేరుగా మమేకం కావాలని సూచించారు. వారానికి ఒకసారి గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో గ్రామాల్లో మంచినీరు, విద్యుత్ సరఫరా అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. వేసవి సమీపిస్తున్న తరుణంలో ఈ సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సర్పంచులు అధికారులను కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ విజయలక్ష్మి, ఐసిడిఎస్ సీడీపీఓ సక్కుబాయి, ఎంపీవో ఇందుజ, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అన్నదాతల చిరునవ్వే లక్ష్యం

- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్





**చింతపల్లి, ఏప్రిల్ 9 నేటి దర్శిని ప్రతినిధి :** రైతుల సౌకర్యార్థం చింతపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల దగ్గరే కొనుగోలు సౌకర్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి గింజకు మద్దతు ధర అందేలా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.తూకం నుంచి నగదు జమ వరకు ప్రతి ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా అధికారులకు సూచించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.అన్నదాతల ముఖాల్లో చిరునవ్వు చూడటమే నిజమైన విజయమని పేర్కొంటూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ విజయలక్ష్మి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం

- దేవరకొండలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ నియోజకవర్గ స్థాయి జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం



**దేవరకొండ, ఏప్రిల్ 09 ( నేటి దర్శిని):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని దేవరకొండ తహసీల్దార్ కార్యాలయంలో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. 2026 ఏప్రిల్ 14న నిర్వహించబోయే నియోజకవర్గ స్థాయి జయంతి వేడుకల ఏర్పాట్లపై తహసీల్దార్ (వీ=ూ) మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఈ సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కరుణశ్రీ, సీఐ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ జయంతి వేడుకలను నియోజకవర్గస్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ శాఖ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వివిధ దళిత , ప్రజా సంఘాలు మరియు సంఘాల నాయకులు పాల్గొని వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు నాగరాజు, పుల్యా, పరంజ్యోతి, దిలీప్, పవన్ పాల్గొని విద్యార్థి వసతి గృహాల్లో నిర్వహించబోయే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సమీక్షా సమావేశంలో బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు, దేవయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు యేకుల సురేష్, అంకురి శివ, మద్దిమడుగు భిక్షపతి, కంబాల పల్లి వెంకటయ్య, ప్రసాద్, ఎర్ర అంజనేలు , పీటర్, లక్ష్మయ్య మరియు మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. జయంతి రోజున ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఘనంగా నివాళులర్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఆర్వో మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మిడ్జిల్ మండలంలో రేషన్ బియ్యం


# 40 శాతం పక్కదారి




**మిడ్జిల్, ఏప్రిల్ 09, (నేటి దర్శిని ప్రతినిధి):** ఈ ఉగాది నుంచే పేదలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బియ్యం పక్కదారి పట్టకుండా కట్టుదిట్ట చర్యలు చేపట్టాలనే సూచనలు వస్తున్నాయి.ప్రస్తుతం ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న పీడీఎస్ బియ్యంలో సుమారు 40శాతంమేర బ్లాక్‌మార్కెట్‌కు తరలుతోంది. మిడ్జిల్ మండల కేంద్రంలో వివిధ గ్రామాలలో బియ్యం కొనుగోలు చేసి, మల్లాపురం గుడియాని పల్లి, మాదారం, గ్రామానికి చెందిన దళారులు ఈఅక్రమదందాకు రేషన్ బియ్యం నెలవుగా మారిందనే ఆరోపణలున్నాయి. పేదవర్గాలకు చెందినవారు సైతంనేరుగా ఈ బియ్యాన్ని ఆహారంగా వినియోగించకపోవడాన్ని ఆసరా చేసుకొని అక్రమార్కులు ఊరూరా మాటు వేసి సేకరించడమే వృత్తిగా పెట్టుకున్నారు. ఈ బియ్యాన్ని అక్రమమార్గంలో సేకరిస్తున్న దళారులు మద్యం కంపెనీలకు, పొరుగు దేశాలకు, తిరిగి సీఎంఆర్ ద్వారా ప్రభుత్వానికి అందిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రేషన్ బియ్యం వక్రమార్గం పట్టకుండా ప్రభుత్వయంత్రాంగం పలు చర్యలు చేపడుతున్నా, అవన్నీ కంటితుడుపుగానే ఉంటున్నా యే తప్పపక్కదారి పట్టకుండా నిలువరించలేకపోతున్నారు. ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారులు సైతం ఈ బియ్యం నియంత్రణలో చిత్తశుద్ధితో వ్యవహరించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యంలో ఎంత మేర పక్కదారి పడుతుందనే అంశంపై నేటి దర్శిని క్షేత్రస్థాయి పరిశీలన చేయగా, పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**పక్కదారిపడుతున్న బియ్యం**

వ్యవసాయాధారిత ప్రాంతమైన జిల్లా కావడంతో పాటు, రేషన్‌కార్డులు ఇచ్చిన సమయంకంటే ప్రస్తుతం వరిసాగు పెరిగింది. బీపీఎల్ పరిధి దాటినా పెద్ద సంఖ్యలో కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉండడం, తదితర కారణాలతో జిల్లాలో పీడీఎస్ బియ్యం వినియోగం 60శాతానికి మించడం లేదని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేసిన పరిశీలనలోనూ ఈ విషయం బలపడింది. ఉమ్మడి జిల్లాలో భిన్నమైన ప్రాంతాల్లో, భిన్నమైన నమూనాలు సేకరించి సర్వే నిర్వహించగా, సగటున ఉమ్మడి జిల్లాలో 40శాతం వరకు రేషన్‌బియ్యం తిరిగి దళారులకు, వ్యాపారుల వద్దకు చేరుతున్నట్టు స్పష్టమైంది.




## కేబుల్ టీవీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

● ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి వినతి



**హైదరాబాద్, ఏప్రిల్ 09 (నేటి దర్శిని):** కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ సదుపాయం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, జర్నలిస్టుల పెద్దన్న విరహత్ అలీ గురువారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డిని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విరహత్ అలీ కేబుల్ టీవీ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి సాధకబాధలను చైర్మన్‌కు వివరించారు. వార్తల సేకరణలో ఎదురయ్యే ఇబ్బందులు, ఛానల్ ప్రసారాల విషయంలో నెట్‌వర్క్ ఆపరేటర్ల నుంచి వస్తున్న ఆర్థిక సమస్యలను కూడా వివరించారు.కేబుల్ టీవీ న్యూస్ ఛానల్ జేఏసీ కన్వీనర్లు బి. నరసింహ చారి, డా. పొదిల వెంకట్, విద్యాసాగర్, పాషా మహేష్ కుమార్, ఉపాధ్యాయ రంజిత్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో 12 మందికి, జిల్లా స్థాయిలో నలుగురికి చొప్పున పాత విధానంలోనే అక్రిడేషన్లు ఇవ్వాలని వారు కోరారు. ఈ వినతిపై స్పందించిన ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి కేబుల్ టీవీ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

## అంగన్వాడీ టీచర్లకు 5జి ఫోన్లు

● ఎమ్మెల్యే బాలు నాయక్ చేతుల మీదుగా పంపిణీ





**చింతపల్లి, ఏప్రిల్ 9 నేటి దర్శిని ప్రతినిధి :** అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయడానికి ప్రభుత్వం అందిస్తున్న 5జి స్మార్ట్‌ఫోన్లను చింతపల్లి మండల కేంద్రంలో గురువారం పంపిణీ చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఈ ఫోన్లను అంగన్వాడీ టీచర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ వివరాలను టీచర్లు నేరుగా నమోదు చేయవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల కార్యకలాపాలు డిజిటల్‌గా నమోదవడం వల్ల సేవల నాణ్యత పెరగడంతో పాటు ప్రభుత్వానికి తక్షణ సమాచారం అందుతుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో బాలల ఆరోగ్యం, పోషణపై మరింత దృష్టి సారించి మెరుగైన సేవలు అందించడం లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీఓ సక్కుబాయి, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళల హామీలు వెంటనే అమలు చేయాలి

● ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్



**నల్గొండ, ఏప్రిల్ 9 (నేటి దర్శిని):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, మహిళలకు ప్రతీ నెల ?2500 ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా విద్యార్థులకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని, కళ్యాణ లక్ష్మి పథకంలో ?1 లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా విస్మరించిందని విమర్శించారు. దీంతో మహిళలను ప్రభుత్వం మోసం చేసిందని ఆమె తీవ్రంగా ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచడం వల్ల మహిళలపై భారం పెరిగిందని, వెంటనే ధరలను తగ్గించాలని కోరారు. అలాగే పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే మహిళా బిల్లును ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం సరైన విధంగా అమలు కావడం లేదని, పనిచేసిన కూలీలకు సరైన పారితోషికం అందడం లేదని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి తగిన నిధులు కేటాయించి, 200 రోజుల పని మరియు రోజుకు ?600 కూలి ఇవ్వాలని కోరారు.ఇటీవల పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు నల్లగొండ పట్టణంలో సమర్థవంతంగా అందలేదని పేర్కొంటూ, ప్రతి అర్హ మహిళకు చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ, నాగమణి, ఎస్కే సుల్తానా, బాబు, రోజు, ఇందిరా, అరుణ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ విస్తరణకు శాఖల సమన్వయం





**రంగారెడ్డి, ఏప్రిల్ 09 (నేటి దర్శిని):** జిల్లాలో ఎల్పిజి గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ వ్యవస్థను విస్తరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ అమలు పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వంట గ్యాస్ వినియోగంలో ఎల్పిజి కు ప్రత్యామ్నాయంగా పి.ఎన్.జీ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రహదారులు, జాతీయ రహదారులు మరియు ఇతర ప్రాంతాల్లో పైప్‌లైన్ నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో పైప్‌లైన్ గ్యాస్ వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు అధికారులు చొరవ చూపాలని, నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో పైప్‌లైన్ గ్యాస్ సేవలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ప్రతి శాఖ కృషి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, సివిల్ సప్లయ్ అధికారి వనజాత, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# రూ.900 కోట్ల భారీ బడ్జెట్‌తో 'రాకా'...

## అల్లు అర్జున్‌తో పాటు మిగతా వారికి రెమ్యునరేషన్ ఎంతంటే..!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ -- స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రాకా' సినిమా ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఈ చిత్రానికి సంబంధించిన భారీ పారితోషికాలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి.ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ.800 నుంచి 900 కోట్ల వరకు ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రానికి సంబంధించిన పారితోషికాలు కూడా ఇప్పుడు పెద్ద చర్చగా మారాయి. హీరో అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్ కోసం రూ.175 కోట్ల రెమ్యునరేషన్‌తో పాటు లాభాల్లో 15 శాతం వాటాను తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా విజయవంతమైతే ఆయన మొత్తం సంపాదన రూ.300 కోట్లకు పైగా వెళ్లే అవకాశముందని విశ్లేషణలు చెబుతున్నాయి.ఇక దర్శకుడు అట్లీ కూడా తన స్థాయికి తగ్గట్టుగా భారీ పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి బ్లాక్‌బస్టర్ విజయానంతరం ఆయన ఈ సినిమాకు దాదాపు రూ.100 కోట్ల వరకు డిమాండ్ చేసినట్లు టాక్. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. ఆమెకు రూ.20 నుంచి 25 కోట్ల వరకు పారితోషికం అందుతున్నట్లు తెలుస్తోంది. అలాగే నేషనల్ క్రష్‌గా గుర్తింపు పొందిన రష్మిక మందన్న ఈ సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుండటం విశేషం. ఈ పాత్ర కోసం ఆమెకు రూ.5 నుంచి 7 కోట్ల వరకు పారితోషికం అందుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.భారీ తారాగణం, హై టెక్నికల్ వాల్యూస్, అట్లీ స్టైల్ మాస్ ఎలిమెంట్స్ అన్నీ కలిపి 'రాకా'ను ఒక విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఫస్ట్ లుక్‌తోనే భారీ అంచనాలు పెంచుకున్న ఈ చిత్రం విడుదలకు ముందే ఇండస్ట్రీలో రికార్డుల చర్చ మొదలైంది. విడుదలైన తర్వాత బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే, అల్లు అర్జున్ -- అట్లీ కాంబోలో రాబోతున్న 'రాకా' సినిమా భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలవబోతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. టాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య రూపొందుతున్న తాజా చిత్రం రాకా అల్లు అర్జున్ హీరోగా, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది.

# పెద్దితో ఆటపాట?



ఇటీవల వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించింది హైదరాబాదీ సొగసరి మానస వారణాసి. ప్రస్తుతం ఈ భామకు టాలీవుడ్‌లో మంచి ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రంలో ఈ అమ్మడు ఓ ఐటెంసాంగ్‌లో నర్తించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ ప్రత్యేకగీతం కోసం మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించారని, డేట్స్‌లేని కారణంగా ఆమె తిరస్కరించిందని సమాచారం.ఈ నేపథ్యంలో ఈ స్పెషల్‌సాంగ్ కోసం చిత్రబృందం యంగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసే ప్రయత్నాల్లో ఉందట. ఇప్పటికే మానస వారణాసితో సంప్రదింపులు పూర్తయ్యాయని అంటున్నారు. అయితే ఈ వార్తలో నిజానిజాలెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'పెద్ది' చిత్రం ఒక్కపాట మినహా షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# గత్తర లేపిన ప్రియా ప్రకాష్..

## అందాలతో కవ్విస్తున్న కుర్ర భామ

ఒక చిన్న కన్నుగీటే సన్నివేశంతో యావత్ భారతదేశాన్ని తనవైపు తిప్పుకుంది కేరళ కుట్టి ప్రియా ప్రకాశ్ వారియర్. ఇంకా చెప్పాలంటే కేవలం ఒక్క రాత్రిలోనే సెలబ్రిటీ హోదాను సొంతం చేసుకుందీ బ్యూటీ. 'ఓరు ఆదర్ లవ్' సినిమాలోని సెకన్ల వ్యవధిలో ఉన్న ఆ వీడియో అప్పట్లో నెట్టింట్లో సంచలనంగా మారింది.ఇక ఈ వీడియో వైరల్ అయిన తర్వాత ప్రియాకు సినిమా అవకాశాలు వరుసపెట్టి క్యూ కట్టాయి. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ప్రియాకు ఆఫర్లు వెల్లువెత్తాయి. అయితే ప్రియా మాత్రం ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటోంది. నితిన్ హీరోగా తెరకెక్కిన 'చెక్' సినిమా చేసింది.చెక్ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. చెక్ సినిమా తర్వాత తిరిగి మలయాళంలో బిజీగా మారింది. తెలుగులో చాలా కాలం తర్వాత మెగా మల్టీస్టారర్ మూవీ బ్రో సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా కూడా డిజాస్టర్ అయ్యింది. దాంతో తెలుగులో ఈ అమ్మడు పెద్దగా కనిపించడం లేదు.ఇటీవల, ఆమె "గుడ్ బ్యాడ్ అగ్లీ" చిత్రంలో అజిత్ కుమార్‌తో కలిసి నటించింది. ఈ సినిమాలో కీలక పాత్రలో నటించింది. అలాగే బాలీవుడ్‌లో "త్రీ మంకీస్", "లవ్ హ్యాకర్స్", కన్నడ చిత్రం "విష్ణు ప్రియ" వంటి ప్రాజెక్టుల్లో నటించింది. ఇక ఈ బ్యూటీ సినిమాలతో కంటే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది.సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, తన క్రేజీ ఫోటోషూట్‌లు, డ్యాన్స్ వీడియోలతో అభిమానులను అలరిస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు వైరల్ గా మారాయి. ఈ పిక్స్ కు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



# డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి

## సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్



కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

# హన్సిక కుటుంబ వివాదం కోర్టుకు..

## వదినపై రూ.2 కోట్ల పరువు నష్టం దావా



సినీ నటి హన్సిక కుటుంబంలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగంగా కోర్టు మెట్లెక్కాయి. తనపైనా, తన కుటుంబంపైనా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ హన్సిక తన వదిన నాన్సీ జేమ్స్‌పై రూ.2 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వానీ భార్య నాన్సీ జేమ్స్ గతంలో సోషల్ మీడియా వేదికగా తన అత్తగారి కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేశారు. గృహహింస, మానసిక వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె పలుమార్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలు ఒక్కసారిగా సంచలనం సృష్టించాయి.అయితే ఈ ఆరోపణలను హన్సిక తీవ్రంగా ఖండించారు. కేవలం డబ్బు వసూలు చేయాలనే ఉద్దేశంతోనే నాన్సీ ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కోర్టులో తెలిపారు. తమ స్టార్ ఇమేజ్‌ను ఉపయోగించుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్నాళ్లు ఈ వివాదంపై మౌనంగా ఉన్నానని, కానీ పరిస్థితులు హద్దులు దాటడంతో న్యాయపోరాటానికి దిగాల్సి వచ్చిందని హన్సిక పేర్కొన్నారు. సోషల్ మీడియాలో నాన్సీ చేసిన వీడియోలు, కామెంట్లు తన తల్లి గౌరవాన్ని దెబ్బతీశాయని, కుటుంబం మానసికంగా ఇబ్బందులు పడుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు నాన్సీ జేమ్స్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. హన్సిక కుటుంబంపై అవమానకర వ్యాఖ్యలు చేయవద్దని, ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వివాదాస్పద వీడియోలను వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు కేసు ప్రాధాన్యతను మరింత పెంచాయి. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వాని కూడా ఈ వివాదంలో తన సోదరికి అండగా నిలిచారు. తన భార్య చేసిన ఆరోపణల్లో నిజం లేదని ఆయన పేర్కొన్నారు. వివాహం తర్వాత కొద్దికాలానికే తమ మధ్య విభేదాలు మొదలయ్యాయని, ఇప్పుడు అవి కుటుంబ స్థాయికి చేరుకున్నాయని తెలుస్తోంది. హన్సిక తరపు న్యాయవాదులు ఈ వ్యవహారాన్ని వ్యాపార ప్రయోజనాలు లేదా వ్యక్తిగత కక్షల కోణంలో చూస్తున్నారు. నాన్సీ కావాలనే వివాదాన్ని పెద్దదిగా చేస్తున్నారని వాదిస్తున్నారు. ఇక కోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఈ వ్యవహారం మరింత మలుపులు తిరిగే అవకాశముంది. హన్సిక కోరిన రూ.2 కోట్ల పరిహారం, అలాగే భవిష్యత్తులో నాన్సీ చేసే వ్యాఖ్యలపై కోర్టు నిర్ణయం కీలకంగా మారనుంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365